క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



బొల్లాపల్లి: మండలంలోని మేళ్ళవాగు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం సోమవారం త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి జ్ఞాన వేదిక కమిటీ వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రైత సిద్ధాంతంలో భగవద్గీత గ్రంథాలను విని తరించాలని తెలిపారు. అనంతరం భగవద్గీత గ్రంథాలను గ్రామంలో ప్రచారం నిమిత్తం పంచారు. కార్యక్రమంలో కె. సైదారావు, కె. అరుణ, ఎం. వీరయ్య, ఎస్. వెంకట లక్ష్మీ, సిహెచ్ అనురాధ, బి.చిరంజీవి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

బొల్లాపల్లి: జగనన్న భూరక్ష శాశ్వత భూహక్కు పథకంలో రీసర్వేకు రైతులు సహకరించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వి.సుధాకర్ శర్మ సోమవారం తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో డ్రోన్ ద్వారా రీసర్వే నిర్వహించామని తెలిపారు. పేరూరుపాడు, కనుమలచెరువు, గుట్లపల్లి, బొల్లాపల్లి గ్రామ సచివాలయాలకు సంబంధించి రీ సర్వేకు ఓఆర్ఐ పత్రాలు అందాయని తెలిపారు. నేడు ఆయా సచివాలయాల పరిధిలో గ్రామ సభలు నిర్వహించి క్షేత్రస్థాయిలో శాశ్వత భూహక్కు శ్రీకారం చుడతామని ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు.

25న ఈపూరు మండల సమావేశం

ఈపూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 25వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు మండల ప్రజాపరిషత్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రంగనాయకులు సోమ వారం తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆయా శాఖల పని తీరుపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

రెండు సచివాలయాల్లో నూతన ఆధార్ నమోదు కేంద్రాలు

బొల్లాపల్లి: మండలంలోని గరికపాడు, గుమ్మనంపాడు గ్రామ సచివాలయాల్లో నూతనంగా ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ, పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ ఆయా సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను నేటి నుంచి ప్రారంభించి సేవలు అందించనున్నట్లు తెలిపారు. విధులు పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సర్వీసులు పట్ల శ్రద్ధ వహించాలని, సర్వీసు పరిధిలో వచ్చే నగదును జమ చేయడంలో తేడా లేకుండా చూడాలన్నారు. సూచికలపై సమీక్ష నిర్వహించారు. బీమా నగదు చెల్లింపు విషయంలో శ్రద్ధచూపాలన్నారు. తక్షణమే బీమా నగదు అందేలా చూడాలన్నారు. సమీక్షలో సచివాలయ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల బైకు ర్యాలీ

నరసరావుపేట: మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బయలుదేరి జిల్లా కలెక్టరేట్ వరకు కొనసాగారు. తమను శాశ్వత కార్మికులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న తమను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఈనెల 24వ తేదీలోగా తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఛలో విజయవాడ నిర్వహించి ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకుడు సాల్మన్, కార్మికులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఎస్సై జె.బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు బాపట్ల జిల్లా పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామానికి చెందిన ముడావత ఇర్మియానాయక్ (50) వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. ఈ నెల 14న గణపవరం గ్రామంలోని తన బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా, సినిమాహాల్ సెంటర్ వద్దకు చేరుకునే సరికి కుక్కను తప్పించే క్రమంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి క్రిందపడ్డాడు. తీవ్రగాయాలైన ఆయనను 108 సాయంతో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించాడు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు.

చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

చిలకలూరిపేటటౌన్: చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని రూత్‌డైక్‌మెన్ కాలనీకి చెందిన ధనరాజుపల్లి అఖిల్ (13) బీఆర్‌ఐజీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం స్నేహితులతో కలసి సమీపంలోని చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. తండ్రి రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నిక ఏదైనా.. పట్టం వైఎస్సార్ సీపీకే

- స్థానిక సంస్థల ఉప ఎన్నిక విజయాలే ఇందుకు నిదర్శనం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- దింతెనపాడులో గడప గడపకు కార్యక్రమం



మహిళలకు సంక్షేమ కరపత్రం అందజేస్తున్న మంత్రి రజిని

యడ్లపాడు: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అణగారిన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. యడ్లపాడు మండలం దింతెనపాడు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం రాత్రి జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి రజినిని గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. స్థానిక ఎస్సీకాలనీలోని లూథరన్ చర్చిని సందర్శించారు. చర్చి పాస్టర్ కిరణ్‌పాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలు మాలలు వేసి నివాళి అర్పించారు. వెంటనే కాలనీలోని ఇంటింటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత నాలుగేళ్ల కాలంలో ప్రజలకు జరిగిన లబ్ధి వివరాలను మహిళలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ గ్రామస్తుల నుంచి అడిగి తెలుసుకున్నారు. సమస్యల్ని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజలు అంతిమంగా జగనన్న సంక్షేమ పాలనకే మొగ్గు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఆయా కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి తను సాధిస్తున్నందు వలనే పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఎన్నికల్లో ఎన్ని కోణాల్లో చూసినా ప్రజలు అంతిమంగా జగనన్న సంక్షేమ పాలనకే మొగ్గు చూపారనేది తాజాగా జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలకు భిన్నంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు విజయ ప్రభంజనం సృష్టించారన్నారు. ఎన్నిక ఏదైనా ప్రజలు చెక్కుచెదరకుండా వైఎస్సార్‌సీపీకి పట్టకడుతున్నారన్నారంటే జగనన్న పాలనపై ప్రజలకు ఎంత నమ్మకం ఉందో ఇట్టే అర్థం అవుతుందన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు వైఎస్సార్‌సీపీకే మద్దతు పలుకుతారని ఇటీవల ప్రతిష్టాత్మక జాతీయ సర్వేసంస్థలు ఇచ్చిన నివేదికలే ఇందుకు నిదర్శనం అన్నారు. సంక్షేమ రథసారథిని ఆశీర్వదిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడటం తథ్యమన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంటా శంకర్, జడ్పీటీసీ సభ్యులు ముక్తా వాసు, ఎంపీపీ పిడతల ఝాన్సీ, పి దయాసాగర్, జీఎస్‌కే కన్వీనర్ రాచమంటి చింతారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అన్నలదాసు శ్యామ్‌పాల్, అత్తోట శివనాగయ్య, మేడూరి శివనాగేశ్వరరావు, అత్తోట రామారావు, తోటకూర ఏసుబాబు, ముప్పాళ్ల రామారావు, పావులూరి వాసు, జంగా ప్రసన్న, కొప్పుల శ్యామేల్ పాల్, ముద్దన పుల్లయ్య, వలేటి ఉదయ్‌కిరణ్, ఎం.విజయ బాలచంద్రారెడ్డి, కోటిరెడ్డి, చాగంటి శ్రీధర్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షలకు రంగం సిద్ధం



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి

శావల్యాపురం: జాతీయస్థాయిలో త్వరలో జరగనున్న ఎన్ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షలకు అర్హత కల్గిన 8వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొద్దపాటి విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లోని 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్షలపై సూచనలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సారథ్యంలో జాతీయ ప్రతిభా పురస్కార్ ఉపకార వేతనాల పరీక్షల్లో ప్రభుత్వ నిబంధనలు మేరకు సమగ్ర సమాచారంతోసెప్టెంబరు 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈపరీక్షలో ఎంపికైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాలు పాటు ప్రతి ఏడాది రూ. 12 వేలు చొప్పున ఉపకార వేతనం నగదు విద్యార్థి బ్యాంకు ఖాతాలో నేరుగా ప్రభుత్వమే జమ చేస్తుందన్నారు. అనంతరం పరీక్షలకు సంబంధించిన సూచనలు చేశారు.

రేపటి నుంచి బోయపాలెంలో తిరునాళ్ల

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం జాతీయ రహదారి ప్రక్కనే వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం 31 తిరునాళ్ల మహోత్సవం ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు హనుమాన్ ప్రసాద్‌తివారి, గంగాదేవి దంపతులు తెలిపారు. తిరునాళ్ల వేడుకలను బుధవారం ఉదయం నుంచే ప్రారంభం కానున్నాయని, తొలి రోజున ఆలయ అర్చకులు పరాంకుశం హనుమాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు, అంకురార్పణ, ఏకాహం, భజనలు ఉంటాయన్నారు. గురువారం నాడు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండస్థాపన, దీక్ష మత్స్యగ్రహణం, తిరునాళ్ల రోజున ఉదయం 11.50 గంటలకు శ్రీసీతారామస్వామి వారి కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. అద్దంకి తిరుమల శ్రీనివాస నృశింహ తాతాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కల్యాణానికి భక్తులు వేలాదిగా విచ్చేయాలని కోరారు. పీటలపై కూర్చునే దంపతులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

వేడుకల సందర్భంగా పలు రకాల ప్రసాదాలు, కళ్యాణం అనంతరం భక్తులు అన్నవితరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. స్టోన్ క్రషర్స్, స్పిన్నింగ్ మిల్లు, బోయపాలెం, పార్వతీపురం గ్రామపెద్దల సహకారంతో అంగరంగ వైభవంగా నిర్వహించే ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

హోంగార్డు కోదానయ్యకు కన్నీటి వీడ్కోలు



అంత్యక్రియల్లో పాల్గొన్న సీఐ సాంబశివ రావు, ఎస్ఐ చెన్నకేశవులు, స్టేషన్ సిబ్బంది

వినుకొండ(నూజెండ్ల): పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు కోదానయ్య శనివారం మృతి చెందాడు. కోదానయ్య మృతదేహానికి సోమవారం మట్టి కార్యక్రమం నిర్వహించారు. మసీదు మాన్యంలోని అతని ఇంటి వద్ద నుంచి తిమ్మాయపాలెం రోడ్డులోని ముస్లిం ఖబరస్తాన్ వరకు పార్థివదేహాన్ని జనజాగా ఒకరు భుజాలు ఒకరు మార్చుకుంటూ తీసుకెళ్లారు. అక్కడ మసీదులో నమాజ్ చదివి మట్టి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సాంబశివరావు, ఎస్ఐ చెన్నకేశవులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం



ఇక్కుర్రులో బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు



మాట్లాడుతున్న ఐసీడీయస్ సూపర్‌వైజర్లు

నరసరావుపేట రూరల్: బాల్య వివాహం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.వెంకటేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని పాలపాడు సెక్టార్ పరిధిలో ఇక్కుర్రు గ్రామ సచివాలయంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొని వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాల వలన ఆడబిడ్డ జీవితంతో పాటు కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతుందన్నారు. జనిస్తూ ఏ బిడ్డ మరణించకూడదు–జన్మనిస్తూ ఏ తల్లి మరణించకూడదనే ఉద్దేశ్యంతో ఐసీడీఎస్ పనిచేస్తుందని తెలిపారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వలన బాలిక ఆరోగ్యం క్షీణిస్తుందని, మరణాలు కూడా సంభవించవచ్చని తెలిపారు. ఈ అనర్థాలను నిరోధించేందుకు బాల్య వివాహాలు జరగకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వి.మంగమ్మ, అరుణ, అంతోనమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

రొంపిచర్ల : మండలంలో మునమాక, వడ్లమూడివారిపాలెం, రొంపిచర్ల, గోగులపాడు, కర్లకుంట, నల్లగార్లపాడు, మాచవరం గ్రామసచివాలయాలలో సోమవారం ఐసీడీయస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో బాల్యవివాహాలు కలిగే అనర్థాల గురించి వివరించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వివాహం చేసుకునే మగవారికి 21 సంవత్సరాల వయస్సు, ఆడవారికి 18 సంవత్సరాల వయస్సు కలిగియుండాలని అన్నారు. వీటిని అతిక్రమించి బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీయస్ సూపర్ వైజర్లు కె.శశిదేవి, దేవిభాయి, అంగన్వాడీ టీచర్లు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర మహాసభలకు తరలిన ఉద్యోగులు



మహాసభలకు తరలుతున్న ఉద్యోగులు

సత్తెనపల్లి: విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్(ఆంధ్రప్రదేశ్) నాన్ గజిటెడ్ అధికారుల సంఘం 21వ రాష్ట్ర మహాసభలకు స్థానిక ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు సోమవారం పయనమయ్యారు. పట్టణంలోని ఏపీఎన్జీవో కార్యాలయం వద్ద ఏపీ ఎన్జీవోస్ సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు పెండెం మణిరావు వాహన జెండా ఊపి ప్రారంభించారు.

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య మిత్రా అవార్డు అందజేత



నరసరావుపేట: వినుకొండ తిరుమల నర్సింగ్ హోమ్ హాస్పిటల్‌లో పనిచేసే ఆరోగ్యమిత్ర కాకాని అప్పారావుకు సేవా మిత్రా అవార్డును జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అందజేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవార్డులను అందిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా జూలై–2023 నెలకు అప్పారావు ఎంపికయ్యారు. అవార్డుతో పాటు రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. సునీల, ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు సత్కారం



నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ భవన్‌లో సోమవారం వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డేను ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ రీజనల్ మేనేజర్ డి.రామ్‌కుమార్, చీఫ్ మేనేజర్ వెన్నా మాధవి తమ సిబ్బందితో పాల్గొని సీనియర్ సిటిజన్స్ కె.కోటిరెడ్డి, కృష్ణమూర్తి, జి.సుబ్బారావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి ఆదెయ్య, కోశాధికారి గుమ్మడి రాఘవయ్య, జాయింట్ సెక్రెటరీ పచ్చల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సుయాత్రను జయప్రదం చేయాలి

చిలకలూరిపేటటౌన్: యువత దేశపరిస్థితిని అవగాహన చేసుకొని ప్రజాపోరాటాలకు సిద్ధం చేయాలని సీనియర్ కమ్యునిస్టు పార్టీ నాయకులు రావిపాటి వెంకటేశ్వరరావు చెప్పారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏరియా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాలు, వర్గాల మధ్య చిచ్చు పెడుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి వాటిని ఎదుర్కొవాలని కోరారు. ఈ సందర్భంగా ఆగస్టు 27వ తేదీ పల్నాడు జిల్లాలో ప్రవేశించనున్న సీపీఐ బస్సు యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, కందిమళ్ల వెంకటేశ్వర్లు, బొంతా తిరుపతయ్య, పేలూరి రామారావు, సురభిరాజు, బి.భగత్‌సింగ్ పాల్గొన్నారు.

యల్లమందలో నాభూమి-నాదేశం ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు

నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని యల్లమంద గ్రామంలో నామట్టి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ గ్రామంలో ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం నా మట్టి– నాదేశం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.రాజేష్ బాబు మాట్లాడుతూ అమర్ జవాన్ల త్యాగాలను, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను గౌరవించుకునేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నామట్టి– నాదేశం కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. నేటి విద్యార్థులకు అమర జవాన్ల త్యాగాలను తెలియజేసేందుకు కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.రాంబాబు, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వి.పార్వతి పాల్గొన్నారు.

అన్ని వసతులు కల్పించటమే లక్ష్యం

రెండు వార్డుల్లో రూ.40 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని ప్రకాష్‌నగర్ 13, 14 వార్డుల్లో రూ.40 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు, డ్రెయినేజ్, వాటర్‌లైన్, లైటింగ్, కల్వర్టు పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ పనులు ఆంధ్రాబ్యాంకు, లైట్, వైట్ హౌస్, టౌన్ హాలు పరిసర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేస్తారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డులలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు.ముఖ్యంగా సీసీరోడ్లు, డ్రైనేజీలకు ప్రాధాన్యత క్రమంలో నిర్మిస్తున్నామన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి పట్టణంలో అభివృద్ధి పను లు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్, ఎం.ఇ డి.శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసరావు, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషా భేగం ఖాజావలి, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అధికారి చైర్మన్ మిట్టపల్లి రమేష్, స్వచ్ఛాంధ్ర, గిరిజన, మాదిగ, ముదిరాజు కార్పొరేషన్ డైరక్టర్లు ఎస్.సుజాతాపాల్, పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, ఇయం.స్వామి, మాజీ కౌన్సిలర్లు బెహరా విజయభారతి, మాగులూరి రమణారెడ్డి, చల్లగుండ్ల సతీష్, ఎస్‌సీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మల్లెల అశోక్, నాయకులు ఎస్‌కే ఆంజనేయులు, వెంకటేశ్వరరెడ్డి, గంటినపాటి గాబ్రియేలు, న్యాయవాది బెహరా విజయకుమార్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాదెండ్ల-లింగారావుపాలెం మధ్య దగ్గర రహదారి

నడికట్టు రామిరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు



ముమ్మరంగా సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

నాదెండ్ల: రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా పేరొందిన చిరుమామిళ్ళ గ్రామాన్ని చుట్టుప్రక్కల గ్రామాలతో అనుసంధానం చేస్తూ లింకు రోడ్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి రూ.6 లక్షల సొంత నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. నాదెండ్ల వెళ్లే రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి క్వారీ మధ్యలో గుండా లింగారావుపాలెం గ్రామాన్ని కలుపుతూ లింకు రోడ్డు పనులు చేపట్టారు. గతంలో క్వారీ గుంత ఉండగా, గ్రావెల్‌తో ఫిల్లింగ్ చేసి బీటీ రోడ్డు వేస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు కారణంగా నాదెండ్ల–లింగారావుపాలెం సహా పలు గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు షార్ట్ కట్ ఏర్పాటైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రోడ్డు పనులను దాత నడికట్టు రామిరెడ్డి పరిశీలించారు.

నేడు విద్యుత్ అదాలత్

చిలకలూరిపేట: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం పట్టణంలోని సుబ్బయ్యతోటలో ఉన్న ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రంలో మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ వినియోగదారుల ఆదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఈఈ చల్లా రమేష్ తెలిపారు. గుంటూరు- 2 డివిజన్ పరిధిలోని చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు, మేడికొండూరు, ఫిరంగిపురం, పత్తిపాడు, వట్టి చెరుకూరు మండలాలకు సంబంధించిన సమస్యలపై ఈ విద్యుత్ అదాలత్ నిర్వహిసున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్.విక్టర్ ఇమ్మానియేల్, సాంకేతిక సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు ఎ.రామ్‌దాస్, స్వతంత్ర్య సభ్యులు ఎ.సునీత పాల్గొంటారన్నారు. విద్యుత్ వినియోగదారులు వారియొక్క పరిష్కారం కాని విద్యుత్ సమస్యలను రాత పూర్వకంగా ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని కోరారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

నరసరావుపేట టౌన్: పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ సోమవారం తెలిపారు. రామిరెడ్డిపేట పాలకేంద్రం ఎదుటి వీధిలో జూదం ఆడుతున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ పేకాట ఆడుతున్న తురక ఆంజనేయులు, కుంచాల చిన్న, డేవెళ్ల రవి, తన్నీరు దుర్గారావులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు, పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

మట్కా నిర్వాహకులపై కేసు..

ప్రకాష్‌నగర్ డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు హాస్పటల్ పక్కన, చిత్రాలయ టాకీస్ వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు సోమవారం దాడులు నిర్వహించారు. అక్కడ మట్కా జూదానికి పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిపై చర్యలు నిమిత్తం వన్‌టౌన్, టూటౌన్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

నాదెండ్ల: చందవరం గ్రామంలో ఘర్షణ జరిగిన నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జె.బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు చందవరం గ్రామానికి చెందిన గొంటు జయభాస్కరరెడ్డి తన ట్రాక్టర్‌తో తన మేనమామైన చేరెడ్డి కృష్ణారెడ్డిని ఢీకొట్టాడు. గాయాలైన కృష్ణారెడ్డిని పరామర్శించేందుకు వెళ్లిన తన సోదరుడైన గొంటు శ్రీనివాసరెడ్డిపై దాడి చేశాడు. ఆయనకు బలమైన గాయం కావటంతో నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు జయభాస్కరరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పొలాల్లో పేకాట స్థావరంపై దాడి

బొల్లాపల్లి: బండ్లమోటు పోలీసుల ఆధ్వర్యంలో పేకాట స్థావరం పై దాడి చేసిన విషయం మండలంలోని రేమిడిచర్ల గ్రామ పొలాల్లో సోమవారం సాయంత్రం జరిగింది. బండ్లమోటు ఎస్సై జి.రవికృష్ణ తెలిపిన వివరాలు రేమిడిచర్ల గ్రామానికి చెందిన రావులాపురం రోడ్డు వైపు వెళ్లే పొలాల్లో సమాచారం పేకాట స్థావరంపై దాడి చేయగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒకరు పరారయ్యాడు. వీరి నుంచి రూ.25 750, వేల రూపాయలు నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీన పరచుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. జూదం చట్టరీత్యా నేరమని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడిలో బండ్లమోటు పోలీసులు తదితరులు పాల్గొన్నారు,

నేడు విద్యుత్ వినియోగదారుల మెగా అదాలత్

నాదెండ్ల: విద్యుత్ వినియోగదారుల మెగా అదాలత్ నేడు నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ రమేష్ తెలిపారు. గణపవరం సబ్‌స్టేషన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. చిలకలూరిపేటలోని సుబ్బయ్యతోటలోని 33/11 కేవీ ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రం ఆవరణలో ఉదయం 10.30 గంటల నుండి 1.30 గంటల వరకూ సమస్యల పరిష్కారం నిమిత్తం అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలం, ఒట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, ఫిరంగిపురం, మేడికొండూరు డివిజన్ల పరిధిలో అదాలత్ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్ విక్టర్ ఇమ్మానియేల్, సాంకేతిక సభ్యులు వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు ఎ.రామదాస్, స్వతంత్ర్య సభ్యులు సునీత పాల్గొంటారని తెలిపారు. సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలన్నారు.

9న నేషనల్ లోక్ అదాలత్

వినుకొండ టౌన్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూ ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు 2023 సెప్టెంబర్ 9న నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి యు. రామ్మోహన్ సోమవారం తెలియచేశారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మనోవర్తి, బ్యాంకు కేసులు, వివాహ సంబంధ వివాదాలు, ప్రీ లిటిగేషన్ కేసులు, రాజీ పడదగిన భూ వివాదాలు, విద్యుత్, తాగునీరు, టెలిఫోన్ వివాదాలు వంటి కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. అంతేకాకుండా వినుకొండ న్యాయస్థాన పరిధిలోని ఎవరైనా కక్షిదారులు కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోదలిస్తే, నేరుగా మండల న్యాయ సేవాధికార సంస్థ, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనం వినుకొండ నందు నేరుగా సంప్రదించవచ్చన్నారు.